క్లుప్తంగా

కాశీ విశ్వేశ్వరుడికి రుద్రాభిషేకం


అన్నపూర్ణ, విశాలాక్షి సమేత కాశీ విశ్వేశ్వర స్వామి

టి.నరసాపురం: టి.నరసాపురం అన్నపూర్ణ, విశాలాక్షి సమేత కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో బుధవారం రుద్రాభిషేకం నిర్వహించారు. మాస శివరాత్రిని పురస్కరించుకుని ఆలయంలో కొలువైన అన్నపూర్ణ, విశాలాక్షి సమేత కాశీ విశ్వేశ్వర స్వామిని విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మహన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. అమ్మవార్లకు కుంకుమ పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.

మద్ది అంజన్న ఆలయంలో పూజలు


సుప్రజకి ఆశీర్వచనాలు అందజేస్తున్న అర్చకులు

జంగారెడ్డిగూడెం రూరల్: జంగారెడ్డిగూడెం మండలం గురవాయిగూడెం మద్ది ఆంజనేయ స్వామిని బుధవారం ఆంధ్రప్రదేశ్ ఏసీబీ హెడ్ కోటర్స్ ఎస్పీ సుప్రజ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ ఈవో ఆకుల కొండలరావు ఆలయ మర్యాదలతో ఎస్పీకి స్వాగతం పలికారు. స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు అనంతరం అర్చకులు, పండితులు వేద ఆశీర్వచనాలు అందజేశారు. స్వామివారి ప్రసాదాన్ని ఎస్పీ సుప్రజకి ఈఓ అందజేశారు.

వినాయక స్వామి ఆలయంలో అన్నసమారాధన

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో బుధవారం అన్నసమారాధన నిర్వహించారు. తొలుత స్వామి వారికి నైవేద్యంగా చక్కెర పొంగలి, పులిహోర, రెండు రకాల కూరలు, సాంబారు, పెరుగు, అన్న ప్రసాదం సమర్పించారు. అనంతరం అన్నప్రసాద వితరణ కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ నిర్వహించారు. సుమారు 1,100 మంది అన్నప్రసాదాన్ని స్వీకరించినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఆలయంలో ప్రతి నెలా మొదటి బుధవారం అన్నప్రసాద వితరణ చేయనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో కొమ్మసాని రవీందర్ రెడ్డి, చల్లా వరప్రసాద్, కల్లూరి మురళీకృష్ణ, శ్రీధరాల శ్రీనివాస వెంకట గంగాధర్, భక్తులు పాల్గొన్నారు.

కాపు సంక్షేమ సేవ అధ్యక్షుడిగా భీమాల

గణపవరం: ఉంగుటూరు నియోజకవర్గ కాపు సంక్షేమ సేవా సమితి అధ్యక్షుడిగా గణపవరానికి చెందిన భీమాల శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఈమేరకు రాష్ట్ర సంఘం అధ్యక్షుడు పులి శ్రీరాములు పంపిన నియామక పత్రాన్ని ఆయన విలేకరులకు చూపించారు. నియోజకవర్గంలో కాపు కులస్తుల ఐక్యతకు, సంక్షేమానికి కృషి చేస్తానని, ఈనెలాఖరులోగా గణపవరం, నిడమర్రు, ఉంగుటూరు, భీమడోలు మండలాల కమిటీ లు ఏర్పాటు చేసి, అనంతరం గ్రామ కమిటీల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటానని చెప్పారు.

కోడి వ్యర్థాలతో వ్యాన్ స్వాధీనం

భీమడోలు: ఏలూరు పరిసర ప్రాంతాల్లోని కోడి మాంసం దుకాణాల వద్ద నుంచి సేకరించి వ్యర్థాలను కొల్లేరు ప్రాంతాలకు తరలిస్తున్న ఓ వ్యాన్‌ను పోలీసులు కురెళ్లగూడెం వద్ద బుధవారం పట్టుకున్నారు. వ్యాన్‌లోని టన్ను కోడి వ్యర్థాలను స్వాధీనం చేసుకున్నారు. నిడమర్రు మండలం తోకలపల్లికి చెందిన భలే సుబ్బరాజు, భలే నరేష్ అనే వ్యక్తులు కోడి వ్యర్థాలను కొల్లేరు గ్రామాలకు తరలిస్తున్నారు. ఎస్సై వై.సుధాకర్‌కు వచ్చిన సమాచారం మేరకు కురెళ్లగూడెం వద్ద వాహనాన్ని ఆపి వ్యర్థాలను తరలిస్తున్నట్లు నిర్ధారించారు. వారిపై కేసు నమోదు చేసి, వాహనాన్ని సీజ్ చేశారు.

ఉద్యోగులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

ఏలూరు(మెట్రో): సార్వత్రిక ఎన్నికల్లో ఘన విజయం సాధించిన కూటమి పార్టీలకు అభినందనలు తెలుపుతున్నట్టు ఎన్‌జీఓ జిల్లా అధ్యక్షుడు చోడగిరి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికలు సజావుగా సాగడంలో ఉద్యోగులు కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. నూతన ప్రభుత్వం ఉద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. ఎన్‌జీఓ కార్యదర్శి నెర్సు రామారావు మాట్లాడుతూ గతంలో చేసిన ఆందోళనల్లో ప్రభుత్వ ఉద్యోగులపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని అంగన్‌వాడీ, ఆశ, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ప్రతి నెలా జీతాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. జిల్లా ఎన్‌జీఓల తరుపున ఎమ్మెల్యేలకు, ఎంపీలకు శుభాకాంక్షలు తెలిపారు.

వామ్మో పిడుగు .. తస్మాత్ జాగ్రత్త

- వర్షాకాలంలో పొంచి ఉన్న ముప్పు
- ఎక్కడ పడుతుందో తెలియని పరిస్థితి
- అప్రమత్తతతోనే ప్రమాదాల నివారణ


పిడుగు పడుతున్న దృశ్యం (ఫైల్)

బుట్టాయగూడెం: వర్షాకాలం వచ్చిందంటే ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తూ ఉంటాయి. ఈ నేపథ్యంలో పిడుగులు పడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. పిడుగు ఎప్పుడు పడుతుందో, ఎలా పడుతుందో తెలియని పరిస్థితిలో ప్రమాదాలు వాటిల్లి ఒక్కోసారి ప్రాణనష్టం కలుగుతుంది. మెరుపుల ధాటికి గృహోపకరణాలు కాలిపోతూ ఉంటాయి. పిడుగులోని కాంతి ప్రభావంతో నష్టం భారీగా ఉంటుంది. ఈ పరిస్థితుల్లో పిడుగు నుంచి రక్షించుకునేందుకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని విపత్తుల శాఖ ఎప్పటికప్పుడు మెసేజ్‌ల రూపంలో హెచ్చరికలు జారీ చేస్తుంది. జాగ్రత్తలు తీసుకోవడం ద్వారానే ప్రమాదాలను నివారించవచ్చని ఆ శాఖ అధికారులు చెప్తున్నారు.

పిడుగు అంటే

వాతావరణంలో చోటు చేసుకున్న పరిణామాలతో ఒక్కసారిగా ఆకాశమంతా మేఘావృతమై మెరుపు వేగంతో విద్యుత్ కాంతి తీగ రూపంలో నేలకు చేరుకుంటుంది. ఒక్కసారిగా విద్యుదావేశం పెరిగి మేఘాల సమీపంలో వ్యతిరేక విద్యుతావేశం ఉన్నప్పుడు వాతావరణంలోని తేమ, దుమ్ము కారణంగా వాటిలోని స్థిర విద్యుత్ భూమి వైపు ప్రవహిస్తుంది. ఒక మిల్లీ సెకన్ కాలంలో మెరుపుతో కూడిన పిడుగు 20 వేల ఆంపియర్ల విద్యుత్ ప్రవాహాన్ని విడుదల చేస్తుంది. అప్పుడు ఏర్పడే విద్యుత్ క్షేత్ర తీవ్రత మీటరుకు 2 లక్షల ఓల్టులతో సమానం. ఇది భూమి నుంచి 1 నుంచి 2 కిలోమీటర్ల పొడవు ఉంటుంది. 2 మేఘాల మధ్య అయితే 7 కిలోమీటర్ల నుంచి 140 కిలోమీటర్ల దూరంలో ఉంటాయి. మెరుపులు భూమి మీద పడినప్పుడు వస్తువులను బట్టి నష్ట తీవ్రత ఉంటుంది.

కాపర్ ఎర్త్ ఏర్పాటుతో ప్రమాదానికి చెక్

పిడుగు పాటు నుంచి తప్పించుకునేందుకు ఎత్తైన ప్రదేశం నుంచి నేరుగా భూమిలోకి కాపర్ ఎర్త్ (రాగి వైర్‌ను అనుసంధానం చేస్తూ భూమిలోకి పాతాలి) ఏర్పాటు చేయడం ద్వారా దాదాపు కిలోమీటరు దూరంలో పడిన పిడుగును నేరుగా భూమిలోకి ఇదే ఆకర్షించుకుంటుంది. ఎర్త్ వైర్‌ను ఉప్పు, కర్రి బొగ్గు, నీటి మిశ్రమాలతో రాగి వైరు కలిగిన రాడ్‌ను భూమి లోపలికి ఏర్పాటు చెయ్యడం వల్ల ప్రమాదాలను నివారించే అవకాశం ఉంటుంది. ఎత్తైన టవర్లు ఏర్పాటు చేసేటప్పుడు పలు జాగ్రత్తలు పాటించడంతో పిడుగుపాటు నుంచి తప్పించుకునే అవకాశం ఉంది.

పాటించాల్సిన జాగ్రత్తలు

వర్షం వచ్చేటప్పుడు చెట్ల కింద ఉండకూడదు. ముఖ్యంగా ఎత్తైన చెట్టు కింద అస్సలు ఉండకూడదు. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం వస్తే రైతులు పొలాల వద్ద బహిరంగ ప్రదేశాల్లో ఉండకూడదు. లక్షల డిగ్రీల ఉష్ణోగ్రతతో విడుదలయ్యే వేడి ఒక్కసారిగా మనిషిని చేరగానే గుండెపై ప్రభావం చూపుతుంది. వర్షపు సూచన ఉన్నప్పుడు గొడుగులపై ఇనుప బోల్టులు, కెమెరాలు, సెల్‌ఫోన్లు దగ్గర లేకుండా చూసుకోవాలి. లేకుంటే రేడియేషన్ తరంగాలకు గురై ప్రమాదం జరిగే అవకాశం ఉంది. మెరుపులు, పిడుగుల వల్ల విద్యుత్ ఉపకరణాలు కాలిపోయే అవకాశం ఉంది. ఆ సమయంలో టీవీలకు ఉన్న విద్యుత్ కేబుల్ కనెక్షన్ తొలగించాలి. వర్షం కురుస్తున్న సమయంలో విద్యుత్ తీగల కింద, ట్రాన్స్‌ఫార్మర్ సమీపంలో ఉండకూడదు. తడి ప్రదేశాల్లో ఉండకపోవడం చాలా మంచిది.

ప్లాస్టిక్ వినియోగంతో పర్యావరణానికి హాని


జంగారెడ్డిగూడెం న్యాయస్థానాల ప్రాంగణంలో మొక్క నాటుతున్న దృశ్యం


పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటుతున్న న్యాయవాదులు


జీలుగుమిల్లి మండలం రాచన్నగూడెం సమీపంలో మొక్కలు నాటుతున్న ఫారెస్ట్ అధికారులు

చింతలపూడి: ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడం ద్వారా పర్యావరణాన్ని రక్షించుకోవచ్చునని పలువురు అన్నారు. ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మండల లీగల్ సెల్ కమిటీ, బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కోర్టు ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించుకోవాలని న్యాయవాదులు ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. మొక్కలు పెంచడం వల్ల కలిగే లాభాలను బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బి నాగేశ్వరరావు వివరించారు. కార్యక్రమంలో కోర్టు సూపరింటెండెంట్ వీబీ సత్యన్నారాయణ, సోషల్ వర్కర్ ఎండీ అక్బర్ అలీ, న్యాయవాదులు మన్నే వెంకటేశ్వరరావు, సూరయ్య, విజయరావు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన ఫారెస్ట్ అధికారులు

బుట్టాయగూడెం: ప్రతి ఒక్కరూ మొక్కలు పెంచి కాలుష్యాన్ని దూరం చెయ్యాలని, పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలని అటవీ శాఖ అధికారి వెంకట బుచ్చయ్య, అటవీశాఖ క్షేత్రాధికారి షేక్ మస్తాన్ వల్లీ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని బుధవారం జీలుగుమిల్లి మండలం రాచన్నగూడెంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం, మొక్కలు పెంచడం వంటి పనులు చెయ్యాలని అన్నారు. అనంతరం వారు మొక్కలు నాటారు. సుమారు 500 మొక్కలను నాటుతున్నామని వాటిని సంరక్షించే చర్యలు చేపడతున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో అటవీశాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెంలో న్యాయవిజ్ఞాన సదస్సు

జంగారెడ్డిగూడెం: ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకొని మండల న్యాయ సేవాధికారి సంస్థ ఆధ్వర్యంలో కోర్టు ప్రాంగణంలో బుధవారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బార్ ప్రెసిడెంట్ ముళ్లపూడి శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. పర్యావరణ దినోత్సవ సందర్భంగా కోర్టు ప్రాంగణంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పర్యావరణంపై అవగాహన కలిగి ఉండి మన చుట్టూ ఉండే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడమే కాకుండా కాలుష్య రహిత సమాజాన్ని తయారు చేసుకోవాలన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని కూడా తగ్గించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో భాగంగా జనరల్ సెక్రటరీ విత్తనాల రాజు, సీనియర్ న్యాయవాదులు పీఎస్‌ఆర్‌కే లక్ష్మణరావు, ఎస్‌వీబీఎల్ ఆచారి, మేకల రామ్మోహన్ రావు, జీవీవీఆర్ శేఖర్, మాదేపల్లి క్రాంతికుమార్, బండారు లతాకుమారి, కోర్టు సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



భీమడోలులో లైబ్రరీలో పర్యావరణ దినోత్సవంపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న తుమ్మల ఉమామహేశ్వరరావు, మండే సుధాకర్

భీమడోలు: పర్యావరణ పరిరక్షణతో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా మానవత స్వచ్ఛంద సేవా సంస్థ కెరీర్ గైడెన్స్ డైరెక్టర్ తుమ్మల ఉమామహేశ్వరరావు అన్నారు. భీమడోలు శాఖా గ్రంథాలయంలో గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో బుధవారం వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా వేసవి విజ్ఞాన తరగతులు ఉల్లాసంగా నిర్వహించారు. చిన్నారులకు నీతి కథలు చెప్పి, వారితో నీతి కథలను వల్లించారు. సామూహిక పుస్తక పఠనం చేశారు. అనంతరం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తుమ్మల ఉమామహేశ్వరరావు, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మండే సుధాకర్ మాట్లాడుతూ చిన్నారులకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. విద్యార్థి దశ నుంచి మొక్కలు నాటితే పర్యావరణాన్ని పరిరక్షించుకోవచ్చునన్నారు. పర్యావరణానికి విఘాతం కలిగిస్తే భవిష్యత్తులో తీవ్ర దుష్పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. ఎక్కువగా మొక్కలు నాటి వాటిని సంరక్షించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దలు, విద్యార్థులు పాల్గొన్నారు.

దాడులకు పాల్పడటం తగదు

దెందులూరు: కౌంటింగ్ అనంతరం కొవ్వలి, శ్రీరామవరం, జోగన్నపాలెం, ఇతర గ్రామాల్లో తెలుగుదేశం కార్యకర్తలు ప్రభుత్వ కార్యాలయాలు, ఇంటికి వెళ్లి దాడి చేయడం సరికాదని, గ్రామాల్లోని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల్లో ఒకసారి ఒకరికి విజయం, మరొకరికి పరాజయం రావడం సహజమన్నారు. గతంలో తమకు విజయం లభించినప్పుడు ప్రభుత్వ కార్యాలయాలపై దాడులు చేయడం, ఇళ్లకు వెళ్లి కొట్టడం ఇలాంటి సంఘటనలు ఏవీ చేయలేదన్నారు. జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం గంగరాజు మామ వైఎస్సార్ సీపీ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు నిట్టా గాంధీపై దాడి చేసి కొట్టడం పట్ల జెడ్పీటీసీ కుటుంబ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. భవిష్యత్తులో దాడులు, దౌర్జన్యం వంటి విధానం మానుకోవాలని సూచించారు.

దోమల నివారణతో మలేరియా దూరం


గణపవరంలో మలేరియాపై అవగాహన కల్పిస్తున్న వైద్యసిబ్బంది

గణపవరం: మలేరియా, డెంగీ తదితర వ్యాధులకు దోమల నియంత్రణతో దూరంగా ఉండవచ్చని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి పులపర్తి సంతోష్ అన్నారు. బుధవారం గణపవరంలో మలేరియా వ్యతిరేక మాసోత్సవాల సందర్భంగా ప్రజలకు మలేరియా వ్యాప్తి, కారణాలు, లక్షణాలు, చికిత్స తదితర విషయాలపై అవగాహన కల్పించారు. జ్వరం వస్తే తప్పనిసరిగా రక్త పరీక్షలు చేయించుకోవాలని, వ్యాధిగుర్తిస్తే చికిత్స పొందాలని సూచించారు. ఇంటి ఆవరణ, పరిసర ప్రాంతాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, దోమల నుంచి రక్షణ చర్యలు తీసుకోవాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారిణి పి.కిరణ్మయి, సీహెచ్‌ఓ జాలాది విల్సన్ వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

యాదవ ప్రజాప్రతినిధులకు అభినందనలు

ఏలూరు (టూటౌన్): ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా ఎనిమిది మంది యాదవ సామాజిక వర్గానికి చెందిన వారు ప్రజాప్రతినిధులుగా ఎన్నిక కావడం పట్ల ఏలూరు జిల్లా, ఏలూరు నగర యాదవ సంఘాలు హర్షాతిరేకాలు వ్యక్తం చేశాయి. స్థానిక సంఘ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో నాయకులు మాట్లాడారు. ఏలూరు పార్లమెంటు నుంచి పుట్టా మహేష్ యాదవ్, ఎమ్మెల్యేలుగా పల్లా శ్రీనివాసరావు (గాజువాక), పి.వంశీకృష్ణ శ్రీనివాస్ (విశాఖ దక్షిణం), యనమల దివ్య (తుని), కొలుసు పార్థసారథి (నూజివీడు), ఎంఎం కొండయ్య యాదవ్ (చీరాల), సత్యకుమార్ యాదవ్ (ధర్మవరం), పుట్టా సుధాకర్ యాదవ్ (మైదుకూరు)కు యాదవ సంఘ నాయకులు అభినందనలు తెలిపారు. జిల్లా యాదవ సంఘం అధ్యక్షుడు చిదరబోయిన శ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉక్కుసూరి గోపాలకృష్ణ మాట్లాడుతూ ఏలూరు పార్లమెంట్ నుంచి ప్రథమ యాదవ నాయకుడిగా పుట్టా మహేష్ చరిత్ర సృష్టించారన్నారు. ఏడుగురు యాదవ ప్రముఖులు ఎమ్మెల్యేలుగా గెలుపొందడం సంతోషదాయకమన్నారు. అభినందనలు తెలిపిన వారిలో జిల్లా యాదవ సంఘం గౌరవ అధ్యక్షుడు కిలారపు బుజ్జి, ప్రధాన కార్యదర్శి గొర్ల రామారావు, కోశాధికారి చిట్టిబోయిన సాయిబాబు, ఆకుల గంగాధర్, బొట్టా అజయ్ కుమార్, బోగా రాజేష్, తదితరులు ఉన్నారు.

అధైర్య పడొద్దు.. పార్టీ అండగా ఉంటుంది

- ప్రతి ఒక్కరూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలి
- జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచారం కమిటీ అధ్యక్షుడు, జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి

జంగారెడ్డిగూడెం: ఫలితాలను చూసి కార్యకర్తలు ఎవరూ అధైర్యపడొద్దని, పార్టీ ప్రతి ఒక్కరికీ అండగా ఉంటుందని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచారం కమిటీ అధ్యక్షుడు, జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి అన్నారు. జంగారెడ్డిగూడెంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో గెలుపు ఓటములు సహజం. ఈ ఫలితాలను చూసి కార్యకర్తలు అధైర్యపడొద్దు. గెలిచిన వారు రెచ్చగొట్టేలా, బాధపెట్టేలా ప్రవర్తించే అవకాశం ఉంది. వాటిని చూసి ఏ ఒక్కరూ సంయమనం కోల్పోవద్దని సూచించారు. మనమంతా జగన్ వెన్నంటి నిలిచి, వచ్చే ఐదేళ్ల సంస్థాగతంగా పార్టీని బలోపేతం చేద్దాం. ప్రతి ఒక్క ప్రజాప్రతినిధి నిరుత్సాహానికి గురికాకుండా, కార్యకర్తలను, అభిమానులను సమన్వయం చేసుకుంటూ ప్రజల మధ్యే ఉంటూ పార్టీని ముందుకు తీసుకువెళదామని అన్నారు. 2029లో జగన్‌మోహన్‌రెడ్డిని సీఎంగా గెలిపించుకునేందుకు అహర్నిశలు పనిచేద్దామని అన్నారు. సంక్షేమాన్ని విస్తృతంగా అమలు చేసినా ఓటమి ఎదురు కావడం బాధ కలిగించిందన్నారు. భవిష్యత్తును మరింత పటిష్టంగా చేసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, అధైర్యం, అసహనం దరి చేరకుండా పనిచేద్దామని ఆయన కోరారు.

భారీ వర్షంతో ఉపశమనం


భీమడోలు జంక్షన్‌లో కురుస్తున్న భారీ వర్షం

భీమడోలు: రోజంతా ఉక్కపోత, రాత్రి భారీ వర్షం కురవడంతో ప్రజలంతా ఉపశమనం పొందారు. ప్రధాన రహదారులన్నీ జలమయమయ్యాయి. మండలంలోని భీమడోలు, గుండుగొలను, పూళ్ల, సూరప్పగూడెం, కురెళ్లగూడెం, అంబర్‌పేట, పోలసానిపల్లి తదితర గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎండ వేడిమి, ఉక్కపోతతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. జాతీయ, రాష్ట్రీయ రహదారులపై వాహనాల రాకపోకలు లేక వెలవెలబోయాయి. జూన్ నెల వచ్చినా వర్షాలు కురవకపోవడం, విపరీతమైన ఎండతో ప్రజలంతా నానా అవస్థలు పడుతున్నారు. వరుణుడు రాక కోసం ప్రజలు, రైతులు ఎదురు చేస్తున్నారు. ఒక్కసారిగా బుధవారం సాయంత్రం నుంచి ఆకాశం మేఘావృతమైన ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురవడంతో ప్రజలంతా ఊపిరి పీల్చుకున్నారు. వాతావరణమంతా చల్లబడడంతో ఉపశమనం పొందారు. పలు రహదారుల గోతుల్లో నీరు నిలిచిపోయాయి. వాహనచోదకులు ఇబ్బందులు పడ్డారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఇదిలా ఉండగా ఎన్నికల నియమావళిలో భాగంగా ఎటువంటి అల్లర్లు జరగకుండా పోలీసులు, రెవెన్యూ అధికారులు ముందుస్తు చర్యల్లో భాగంగా భీమడోలు వారపు సంతను సాయంత్రం ఆరు గంటల తర్వాత ముగించారు.

ఓటమిపై గ్రామీణ ఓటర్లలో అనుమానం

భీమడోలు: ఎన్నికల ఫలితాలను గ్రామీణ ప్రాంత ఓటర్లు అనుమానిస్తున్నారని వైఎస్సార్ సీపీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నౌడు వెంకట రమణ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో తామెంతో లబ్ధి పొందామని, మళ్లీ సీఎంగా జగన్‌ను చూడాలని గ్రామీణులంతా వైఎస్సార్ సీపీకే ఓట్లేసినా పార్టీ ఓడిపోవడంలో ఈవీఎలు, అధికారుల పాత్ర ఉండేమోనన్న అనుమానం వ్యక్తం చేస్తున్నట్టు చెప్పారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాల్లో పలు గ్రామాల్లో పర్యటించి పార్టీ అభిమానులు, నాయకులతో ఓటింగ్ సరళి, పార్టీ ఓటమిపై చర్చించినట్టు చెప్పారు. ఈ చర్చల్లో గ్రామీణ ఓటర్లలో పలు అనుమానాలు వ్యక్తం చేసినట్టు తెలిపారు. ఈవీఎంల ట్యాంపరింగ్ జరిగిందని, తాము వేసిన ఓట్లు ఏటూ వెళ్లిపోయాయ ని వారంతా అనుమానం వ్యక్తం చేస్తున్నారని చెప్పా రు. ఈ ట్యాంపరింగ్ వల్లే రాష్ట్రంలో కూటమి అభ్యర్థులకు భారీ మెజార్టీలు వచ్చాయని, పలు చోట్ల పోలైన ఓట్లకన్నా కౌంటింగ్‌లో ఎక్కువగా చూపి అధికమెజార్టీలు చూపడం దారుణమని అన్నా రు. ఏదేమైనా గ్రామీణ ఓటర్లలో నెలకొన్న అనుమానాలను నివృత్తి చేసేందుకు పార్టీ అధినాయకత్వం తగు న్యాయపోరాటం చేయాలని కోరారు.

విద్యా సంస్థల్లో పర్యావరణ దినోత్సవం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఏలూరు ఉప విద్యాశాఖాధికారి ఎ.రవిప్రకాష్ పిలుపునిచ్చారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు మేతర అజయ్ బాబు అధ్యక్షతన స్థానిక పీడీబీటీ హైస్కూల్, జూనియర్ కళాశాలలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా బుధవారం మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా రవిప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరా నిలిపివేత

టి.నరసాపురం: విద్యుత్ మరమ్మతులు నేపథ్యంలో ఈ నెల 6న కేతవరం 11కేవీ ఫీడర్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఈఈ పి.రాధాకృష్ణ బుధవారం తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని తెలిపారు.

లక్కవరంలో అంగన్‌వాడీ బాట


లక్కవరంలో ర్యాలీ నిర్వహించిన దృశ్యం

జంగారెడ్డిగూడెం రూరల్: జంగారెడ్డిగూడెం మండలం లక్కవరం అంగన్‌వాడీ కేంద్రం సిబ్బంది బుధవారం అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ర్యాలీలో చిన్నారులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ సెక్టార్ సూపర్ వైజర్ మాదాసు విజయ మాట్లాడుతూ మూడు నుంచి ఐదేళ్లలోపు చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పౌష్టికాహారాన్ని గర్భిణిలు, బాలింతలు తీసుకుంటూ ఆరోగ్యంగా జీవించాలన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

శివయ్యకు విశేష అభిషేకాలు


ద్వారకాతిరుమలలోని శివదేవుడు

ద్వారకాతిరుమల: క్షేత్ర పాలకుడిగా విరాజిల్లుతోన్న భ్రమరాంబ మల్లేశ్వర స్వామి ఆలయంలో మాస శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం శివదేవునికి విశేష అభిషేకాలు నిర్వహించారు. ముందుగా దేవస్థానం సిబ్బంది ఆలయాన్ని సుగంధభరిత పుష్పమాలికలు, మామిడి తోరణాలు, అరటి బోదెలతో శోభాయమానంగా అలంకరించారు. అనంతరం మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, అర్చకులు, పండితుల వేద మంత్రోచ్ఛరణల నడుమ గర్భాలయంలో కొలువైన శివదేవునికి అర్చకులు, పండితులు ఏకాదశ రుద్రాభిషేకాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. ఈ వేడుకలో పెద్ద ఎత్తున పాల్గొన్న భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించి, తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. రాత్రి స్వామివారికి నిర్వహించాల్సిన గ్రామోత్సవం వర్షం కారణంగా రద్దయ్యింది.